సాక్షి అనంతపురం

శనివారం : 30 : మార్చి : 2024

I



చీనీ టన్ను రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 4.59



న్యూస్‌రీల్

రారండోయ్.. తేరును చూద్దాం

- నేడు లక్ష్మీ నారసింహుడి రథోత్సవం



బ్రహ్మరథోత్సవానికి సిద్ధమవుతున్న తేరు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. అశేష భక్త జన సందోహం మధ్య శనివారం ఉదయం 7.20 నుంచి 8.10 గంటల మధ్య అనురాధా నక్షత్రంలో మేష లగ్న పుష్కరాంశంలో తేరును ప్రారంభించేందుకు ఆలయ అర్చకులు శుభ సమయంగా నిర్ణయించారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధుల్లోని భవనాలు సైతం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపేందుకు చోటు లేదు. బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించడానికి దేవతలు తమ తమ వాహనాలను పంపుతారని భక్తుల నమ్మకం. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే శ్రీవారి రథోత్సవం నాడు రథాన్ని నడిపి స్వామి వారు విహరించడానికి సహకరిస్తారని, అందుకే బ్రహ్మ రథోత్సవం అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.



మేమంతా సిద్ధం

- నేడు జిల్లాలో సీఎం జగన్ బస్సు యాత్ర
- స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమాయత్తం
- రాప్తాడులో సిద్ధం సభ అనంతరం మళ్లీ జిల్లాలోకి జననేత
- పలు ప్రాంతాల్లో రోడ్ షో
- రాత్రి సంజీవపురం శివారులో బస

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భగభగ మండుతోన్న ఎండలు.. నిప్పుల వాన కురిసినట్టుగా వాతావరణం.. అయితేనేం తమ అభిమాన నేత జిల్లాలోకి వస్తే ఇవన్నీ మాకో లెక్కా అంటున్నాయి పార్టీ శ్రేణులు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం కర్నూలు జిల్లా నుంచి గుత్తిలోకి అడుగు పెట్టనున్నారు. ఇప్పటికే వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో జరిగిన బస్సు యాత్రలో ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టిన విషయం తెలిసిందే. అంతకు మించి అనంతపురం జిల్లాలో అపూర్వ స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి. ఆయన రాక కోసం లక్షలాది మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఎదురు చూస్తున్నారు.

40 రోజుల్లోనే మళ్లీ జిల్లాకు..

రాప్తాడులో ఫిబ్రవరి 18న చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 'సిద్ధం' సభ జరిగింది. లక్షలాదిమంది ప్రజలు జగన్ సందేశాన్ని వినడానికి తరలివచ్చారు. సరిగ్గా సభ జరిగిన 40 రోజుల్లోనే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ జిల్లాకు వస్తున్నారు. అంతేకాదు ముఖ్యమంత్రి హోదాలో వివిధ ప్రభుత్వ పథకాల నిధుల విడుదలకు రాయదుర్గం, పుట్టపర్తి, రాప్తాడు, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు వచ్చారు. ఆయా సభలకు సైతం అశేష జనవాహిని తరలి వచ్చింది. అదే తరహాలో శనివారం జరిగే బస్సు యాత్రకు జిల్లా నలుమూలల నుంచి జనం తరలి రానున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సంజీవపురం శివారులో రాత్రి బస

బస్సు యాత్రలో భాగంగా వైఎస్ జగన్ శనివారం అనంతపురం జిల్లాలోకి ప్రవేశించి గుత్తి, పామిడి, గార్లదిన్నె, అనంతపురం, రాప్తాడు, ఎస్కేయూ మీదుగా రోడ్ షో నిర్వహిస్తారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురం శివారు వరకు బస్సు యాత్ర కొనసాగుతుంది. రాత్రి సంజీవపురం శివారులో సీఎం బస చేయనున్నారు. 31వ తేదీన యాత్రకు విరామం ఇవ్వగా.. ఏప్రిల్ 1న యాత్ర పునః ప్రారంభమై శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగుతుంది. ఏప్రిల్ ఒకటో తేదీన కదిరిలో ముస్లింలు ఇచ్చే ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు. బస్సు యాత్ర సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రత కల్పించినట్టు చెప్పారు.

బస్సు యాత్ర రూట్ పరిశీలన

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి నుంచి గుత్తి మండలం బసినేపల్లి, గుత్తి ఆర్‌ఎస్, గుత్తి ప్రాంతాల్లో జరుగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర రూట్లను ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, పామిడి సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్ పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

గుత్తి/ తాడిపత్రి రూరల్/ అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గుత్తిలోని గేట్స్ హాస్టల్లో శుక్రవారం రాత్రి గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ బస్సుయాత్రలో కొన్ని మార్పులు జరిగాయన్నారు. ముందుగా అనుకున్నట్లు సాయంత్రం నాలుగు గంటలకు కాకుండా ఉదయం 10.30 గంటలకు గుత్తికి చేరుకుంటారన్నారు. కర్నూలు జిల్లా జొన్నగిరి నుంచి గుత్తి మండలంలోని బసినేపల్లి, గుత్తి ఆర్‌ఎస్ మీదుగా గుత్తికి బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. ఎస్కేడీ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 10.30 గంటలకు నాయకులు, కార్యకర్తలు గుత్తి గాంధీ సర్కిల్‌కు చేరుకోవాలన్నారు. పెద్దవడుగూరు మండలం మిడుతూరు బైపాస్‌లో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెప్పారు. అనంతపురంలోని తపోవనం బైపాస్ వద్ద సాయంత్రం ఐదు గంటలకు బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు.

ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బాబుకు లేదు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, కరువు గురించి మాట్లాడే అర్హత మాజీ సీఎం చంద్రబాబుకు లేదని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా పర్యటనలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. శుక్రవారం అనంతపురంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాలు అనంత వెంకటరెడ్డి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం ద్వారా వస్తున్నాయంటే అది వైఎస్సార్ చలవేనని అన్నారు. వైఎస్సార్ కలలను నిజం చేస్తూ 2012లో జీడిపల్లికి నీరు తెచ్చిన చరిత్ర తమదన్నారు. వైఎస్సార్ రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామన్నారని, 1, 2వ దశల్లో పనులు పూర్తి చేసి కుప్పానికి నీరు అందించిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అబద్ధాలు చెప్పడం, ప్రజలను రెచ్చగొట్టడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. మద్యానికి బానిసలు కాకుండా భర్తలను చైతన్యం చేయండి అని చెప్పడం మానేసి, తక్కువ ధరకే మంచి మద్యం ఇస్తా అని 'ప్రజాగళం'లో చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి వ్యక్తికి అధికారం ఇవ్వాలా..? ప్రజలంతా ఒక సారి ఆలోచించాలన్నారు.

శ్రావణిశ్రీని ఓడిస్తాం

శింగనమల: కూటమిలో ఉన్న తమకు చంద్రబాబు 'ప్రజాగళం'లో కనీస గౌరవం ఇవ్వలేదని, టీడీపీ తరఫున పోటీ చేస్తున్న బండారు శ్రావణిశ్రీని ఎన్నికల్లో ఓడిస్తామని జనసేన కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టులతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనసేన శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే మురళీకృష్ణకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని మండిపడుతున్నారు. శ్రావణిశ్రీ మెడలో జనసేన, బీజేపీ కండువాలు కూడా వేసుకోలేదన్నారు. బీజేపీ, జనసేన కార్యకర్తలను కరివేపాకులా వాడుకుని వదిలేస్తే సహించేదే లేదన్నారు. చంద్రబాబు సైతం తన ప్రసంగంలో ఎక్కడా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు.

పెత్తందార్లకు టికెట్లు అమ్ముకున్న బాబు

- శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిపై వ్యాఖ్యలు సరికాదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ అధినేత చంద్రబాబు పెత్తందార్లు, భూస్వాములకు టికెట్లు అమ్ముకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పైలా మాట్లాడారు. ఇటీవల చంద్రబాబు జిల్లా పర్యటనలో శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు 'టిప్పర్ డ్రైవర్' అని తక్కువ చేస్తూ సంబోధించడం సరికాదన్నారు. దళితులంటే ఆయనకు ఎప్పుడూ చిన్నచూపేనన్నారు. శింగనమలలో మాదిగ సామాజికవర్గం వారు అధికంగా ఉండటంతో ఈసారి వైఎస్సార్‌సీపీ తరఫున ఆ సామాజికవర్గం వారికే టికెట్ కేటాయించారన్నారు. అంతేకానీ వేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సీఎంకు నమ్మకమైన వ్యక్తి అని అన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సీఎం దృష్టికి తీసుకెళ్లి శింగనమలలోని చెరువులను లోకల్లైజేషన్ చేయించారన్నారు. చంద్రబాబు అనంతపురంలో దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లులో గుమ్మనూరు జయరామ్ లాంటి ధనబలం కలిగిన వారికి టికెట్లు కేటాయించి మరోసారి తన నిజస్వరూపం చాటుకున్నారన్నారు. అదే వైఎస్సార్‌సీపీలో మడకశిరలో ఈరలక్కప్ప, శింగనమలలో వీరాంజనేయులు లాంటి సామాన్యులకు సీఎం జగన్ టికెట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు భూస్థాపితం కావడం తథ్యమన్నారు. సమావేశంలో నాటక అకాడమీ రాష్ట్ర చైర్‌పర్సన్ ప్రమీల, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.నారాయణ, నాయకులు బండి లలిత కళ్యాణి, అంకె నరేష్, తలారి బయన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

లోక రక్షకుడు ఏసు క్రీస్తు



రాప్తాడులో సిలువ మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి

అనంతపురం కల్చరల్: పాపులను రక్షించేందుకు కరుణామయుడు ఏసు క్రీస్తు సిలువనెక్కిన శుభ శుక్రవారం జిల్లా అంతటా క్రైస్తవులు జరుపుకొన్నారు. పొరుగువారిని ప్రేమించాలని, క్షమాగుణం కలిగి ఉండాలన్న క్రీస్తు సందేశం, నామ స్మరణలతో ప్రార్థనా మందిరాలు మార్మోగాయి. లోకరక్షణ కోసం భువిపై అవతరించి, పరిశుద్ధాత్ములుగా మార్చి సిలువపై రక్తం చిందించిన దైవకుమారుని జీవిత గాథను కాపరులు చక్కగా వినిపించారు. అనంతపురం, గుత్తి, గుంతకల్లు, పామిడి, తాడిపత్రి, శింగనమల, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర ప్రాంతాల్లోని చర్చీల్లో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఆరాధన గీతాలు ఆలపించాయి.

టీడీపీలో ఆగ్రహ జ్వాలలు

- దగ్గుపాటికి అనంత అర్బన్ టికెట్
- భగ్గుమన్న ప్రభాకర్ చౌదరి వర్గీయులు
- టీడీపీ కార్యాలయానికి నిప్పుపెట్టి నిరసన





అనంతపురంలో టీడీపీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం.. దహనమైన కరపత్రాలు, ఫర్నీచర్, వస్తువులు

అనంతపురం క్రైం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున అనంతపురంలో ఆగ్రహజ్వాలలు చెలరేగాయి. అర్బన్ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థిగా రాప్తాడు మాజీ ఎంపీపీ దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌నాయుడు పేరును అధిష్టానం శుక్రవారం ప్రకటించడమే ఇందుకు కారణం. ఇంతకాలం టికెట్ తనకే వస్తుందని ఆశలు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరికి మొండిచేయి చూపడాన్ని ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోయారు. ఒక్కసారిగా వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏకంగా పార్టీ జిల్లా కార్యాలయంలోకి చొరబడి విధ్వంసం చేశారు. ఫర్నీచర్, కంప్యూటర్లు, ఏసీలు, పార్టీ కరపత్రాలను బయట పడేసి నిప్పు పెట్టారు. కార్యాలయ అద్దాలను సైతం ధ్వంసం చేశారు. అధినేత చంద్రబాబును తీవ్ర పదజాలంతో దూషించారు. అంతేకాదు నారా లోకేశ్ ధనదాహంతో టీడీపీని రోడ్డున పడేశారంటూ మహిళా కార్యకర్తలు దుమ్మెత్తిపోశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే టికెట్‌ను రూ.30 కోట్లకు దగ్గుపాటి ప్రసాద్‌కు అమ్ముకున్నారని మండిపడ్డారు. ప్రభాకరచౌదరికి కాకుండా ఎవరికి టికెటిచ్చినా ఉపేక్షించేది లేదని తెగేసి చెప్పారు. అధిష్టానం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పార్టీ కార్యాలయానికి నిప్పు పెట్టడంతో ఆందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, ట్రాఫిక్ పోలీసులతో కలిసి డీఎస్పీ వీరరాఘవరెడ్డి రంగంలోకి దిగారు. ఆందోళనకారులను అక్కడి నుంచి తరిమేశారు. అగ్నిమాపకశాఖకు సమాచారం ఇచ్చి ఫైరింజన్లను తెప్పించి మంటలను అదుపులోకి తెచ్చారు. అటునుంచి పార్టీ కార్యకర్తలు నేరుగా ప్రభాకర్‌చౌదరి ఇంటికెళ్లి అక్కడ ఫ్లెక్సీలు చించి, కరపత్రాలను బయట పడేసి నిప్పంటించారు. సాయంత్రం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు ఇంటి ముందు చౌదరి వర్గీయులు ఆందోళనకు దిగారు. ఇన్నేళ్లు పార్టీ కోసం పనిచేస్తున్న చౌదరిని కాదని మరొక నాయకుడికి టికెట్ ఎలా ఇస్తారంటూ నిలదీశారు. అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

గుంతకల్లులో భగ్గుమన్న 'తమ్ముళ్లు'

గుంతకల్లు: టీడీపీ గుంతకల్లు అసెంబ్లీ టిక్కెట్‌ను గుమ్మనూరు జయరామ్‌కు ప్రకటించడంతో నియోజవర్గంలోని తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా భగ్గుమన్నారు. శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాలయం వద్దకు వందలాదిగా చేరుకొని నిరసన తెలిపారు. కార్యాలయంలోని చంద్రబాబు చిత్రపటాన్ని రోడ్డుపైకి తెచ్చి చెప్పులతో కొట్టారు. టీడీపీ కార్యాలయ బోర్డును పీకేసి, భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలు, కుర్చీలు, జెండాలు, ఇతరత్ర వస్తువులను రోడ్డుపైకి విసిరి, తగులబెట్టారు. కొందరు టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు, ఆయన తనయుడు నారాలోకేష్‌తోపాటు కుటుంబ సభ్యులను దూషించారు. గుమ్మనూరుకు సహకరించేది లేదని స్పష్టం చేశారు.

రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ

భవిష్యత్ కార్యచరణపై కార్యకర్తలతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ తెలిపారు. శుక్రవారం టీడీపీ గుంతకల్లు ఎమ్మెల్యే టిక్కెట్‌ను గుమ్మనూరు జయరామ్‌కు కేటాయించడంతో నియోజకర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున జితేంద్రగౌడ్‌కు మద్దతుగా ఆయన క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పక్క జిల్లా నుంచి వేరొకరిని అరువు తెచ్చుకుని టిక్కెట్ ఇచ్చినారంటే తాము అసమర్థులుగా కనిపిస్తున్నామా అని అధినేతను ప్రశ్నించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జితేంద్రగౌడ్ టీడీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేయాలని పట్టుపట్టారు.



గుంతకల్లు టీడీపీ కార్యాలయం వద్ద వస్తువులను బయటపడేసిన కార్యకర్తలు

రాజీనామాల హంగామా!

అర్బన్ ఎమ్మెల్యే టికెట్ ప్రభాకర్ చౌదరికి కేటాయించలేదని టీడీపీలోని కొంతమంది కీలక నేతలు రాజీనామా చేశారంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు హల్‌చల్ చేశాయి. బూత్ కన్వీనర్లతో సహా 277 మంది పార్టీకి రాజీనామా చేశారంటూ పేర్కొన్నారు. చౌదరి మినహా తన అనుచరవర్గంలో అందరూ రాజీనామాలు చేసినట్లు వ్యతిరేక వర్గం పోస్టులు పెట్టింది.

చౌదరికి రాకపోతే చాలు

అనంతపురం అర్బన్ టికెట్ ప్రభాకరచౌదరికి రాలేదని తెలుసుకున్న ఆ సామాజిక వర్గానికి చెందిన వారే పండుగ చేసుకున్నారు. 40 ఏళ్లుగా పార్టీలో ఎవ్వరినీ ఎదగకుండా చేసిన వైకుంఠానికి పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడే చెక్ పెట్టడం సంతోషంగా ఉందని వారు చెప్పుకొచ్చారు.

బాబు నిర్ణయం సరైంది కాదు

అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎంపిక విషయంలో అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని మాజీ ఎమ్మెల్యే వి.ప్రభాకరచౌదరి అన్నారు. పార్టీ కోసం కష్టకాలంలో అహర్నిశలు పనిచేసిన వారిని కాదని అర్బన్ నియోజకవర్గంతో సంబంధం లేని వ్యక్తికి టికెట్ కేటాయించడాన్ని ఆయన తప్పు పట్టారు. తన భవిష్యత్ కార్యాచరణపై నేడు మీడియా సమావేశంలో వెల్లడిస్తానన్నారు.

క్లుప్తంగా

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం


గౌతమ్‌కౌశిక్

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడి కిడ్నాప్ యత్నం స్థానికంగా కలకలం రేపింది. వివరాలు స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నివాసం ఉంటున్న ఆర్టీసీ కండెక్టర్ గంగాధర్ కుమారుడు గౌతమ్ కౌశిక్ గురువారం రాత్రి తాతతో కలసి ఇంటి బయట మంచంపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఓ కారులో వచ్చిన దుండగులు అపహరించుకెళ్లేందుకు ప్రయత్నించారు. మంచం మీద పడుకున్న బాలుడిని ఎత్తుకుంటుండగా పక్కనే ఉన్న తాత మేల్కొని కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. విషయాన్ని వెంటనే డయల్ 100కు చేరవేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గాలించారు. దుండగుల ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో శుక్రవారం రాత్రి పిచ్చి కుక్క వీరంగం చేసింది. వీధుల్లో సంచరిస్తూ కనిపించిన వారిని వెంటాడి కరిచింది. గాయపడిన వారిలో లాలుస్వామి, గుర్రప్ప, కేశప్ప, సరోజమ్మతో పాటు మరో 11మంది ఉన్నారు. గాయపడిన వారు గుంతకల్లులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఒకరిని అనంతపురానికి రెఫర్ చేశారు. మనుషులతో పాటు ఓ ఎద్దు, ఆవుపై కూడా పిచ్చి కుక్క దాడి చేసింది.

ఓటుపై విస్తృత చైతన్యం

- ఓటు వినియోగించుకునేలా అవగాహన సదస్సులు
- ఓటింగ్ శాతం పెంపుదలే లక్ష్యంగా అధికారిక చర్యలు

అనంతపురం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకుని, దానిని సరైన మార్గంలో వినియోగించుకునేలా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. క్రమబద్ధమైన ఓటర్ల విద్య మరియు ఎన్నికల భాగస్వామ్యం (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ – స్వీప్) కమిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు. కొత్త ఓటర్లను నమోదు చేస్తున్నారు. ఈవీఎంలపై ముమ్మర ప్రచారం చేస్తున్నారు. గతంలో కన్నా ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

ఓటే వజ్రాయుధం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే మంచి ప్రభుత్వం ఏర్పాటవుతుంది. పాలకుల్లో చిత్తశుద్ధి ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఓటరు చైతన్య కార్యక్రమాలను స్వీప్ విస్తృతం చేసింది. ఈ ఎన్నికల్లో గతంలో కన్నా ఓటింగ్ శాతం పెంచడం, ఓటర్లందరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి పర్యవేక్షణలో స్వీప్ బృందాలు పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి షేక్ షఫీ ఈ కమిటీకి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.


'నీ ఓటు నీ భవిష్యత్తు' పేరుతో అనంతపురంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు (ఫైల్)

ప్రతి నియోజకవర్గంలోనూ ఓ కమిటీ

ప్రతి నియోజకవర్గంలోనూ ఓ స్వీప్ నోడల్ అధికారిగా ఎంఈఓ, డీఈ, ఇద్దరు ఏపీఎంలు, 8 మంది నోడల్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. వీరికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ లెవల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి యూత్‌లీడర్లు, సీనియర్ సిటిజన్లు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను భాగస్వామ్యం చేస్తూ ఓటరు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడమే ఈ క్లబ్‌ల ప్రధాన ఉద్దేశ్యం.

సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం:

ఓటు ప్రాధాన్యత, వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నారు. దూర ప్రాంత ఓటర్లకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందజేస్తున్నారు. కియోస్కోలను ఏర్పాటు చేసి తమ ఓటు ఎక్కడ ఉందో ఓటరు తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీలు, పోస్టర్ క్యాంపెయిన్, మానవహారాలు ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించనున్నారు.

భగ్గుమంటున్న భానుడు

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన వేసవితాపం

అనంతపురం అగ్రికల్చర్: భానుడు భగ్గుమనడంతో శుక్రవారం 'ఫ్రై'డేగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సూరీడు మండిపోతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి సీజన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గుంతకల్లులో 42.4 డిగ్రీలు, శింగనమల, బొమ్మనహాళ్ 42.1, తాడిపత్రి 41.8, విడపనకల్లు 41.6, కూడేరు 41.4, పుట్లూరు 41.3, యల్లనూరు 41.2, పెద్దవడుగూరు, ఆత్మకూరు 41.1 డిగ్రీలు నమోదయ్యాయి. అటు శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో 41.6 డిగ్రీలు గరిష్టం కాగా కొత్తచెరువు 41.3, పరిగి 41.1, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి 40.9, ముదిగుబ్బ 40.8, తలుపుల 40.4, రామగిరి, కదిరి, ఎన్‌పీ కుంట 40.3, రొద్దం 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో కూడా 38 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 20 నుంచి 26 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు జనానికి చెమటలు పట్టిస్తున్నాయి. వేసవితాపం పెరగడంతో జనం బయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు.

- వడదెబ్బ సోకకుండా జనం అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేస్తోంది. మంచినీరు, మజ్జిగ, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ లాంటివి ఎక్కువ తీసుకోవాలని, గొడుగు, టోపీ లాంటివి పెట్టుకోవాలని, అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మేలని చెబుతున్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి


మృతుడు నాగార్జున

ఉరవకొండ: వడదెబ్బతో ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన పాల్తూరు నాగార్జున (38) గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గవిమఠం ఆవరణలో శివాలయం వద్ద నిద్ర చేయడానికి వచ్చిన ఆయన శనివారం ఉదయం అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు గుర్తించి లేపేందుకు ప్రయత్నించారు. అయితే చలనం లేకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వడదెబ్బ సోకి మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ అకాడమీ నిర్వాహకులు 'ఉగాది జాతీయ పురస్కారాల'ను అందించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారు సరైన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ సామాజిక సేవా సంస్థ, డోర్ నం.1-20-164, తిరుమలగిరి పోస్టు, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాదు -15' ఏప్రిల్ 4వ తేదీలోపు పంపాలి. అర్హులైన వారికి ఏప్రిల్ 7న హైదరాబాద్‌లో అవార్డులను అందజేయనున్నారు. పూర్తి వివరాలకు 96523 47207లో సంప్రదించవచ్చు.

ఖరీఫ్ విత్తన ప్రణాళిక రెడీ

- 1.25 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ, 2,500 క్వింటాళ్ల కందులు కేటాయింపు
- పచ్చిరొట్ట, కొర్ర, రాగి, పెసర, అలసంద కూడా..


ఈ నెల 28న ఖరీఫ్ విత్తన ప్రణాళికపై జరిగిన సమావేశంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్–2024కు సంబంధించి రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు విత్తన ప్రణాళిక సిద్ధం చేశారు. ఆర్‌బీకే వేదికగా క్షేత్రస్థాయిలో తయారు చేసిన విత్తన ప్రణాళికను ఇటీవల జిల్లా అధికారులు కమిషనరేట్‌కు సమర్పించారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే ఏపీ సీడ్స్ ద్వారా ఎంపిక చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఇతర జిల్లాల నుంచి విత్తనాలు సేకరించి ఎక్కడికక్కడ ఆర్‌బీకేల్లో నిల్వ చేయనున్నారు. ఇదంతా ఏప్రిల్ నెలాఖరుకు సిద్ధం చేసి జూన్ మొదటి వారంలో రైతులకు పంపిణీ చేసేలా ప్రణాళిక రచించారు. విత్తన సేకరణ ధరలు, అమ్మకం ధర, రాయితీలు మే నెల మొదటి వారంలో ఖరారు చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఎన్నికల కోడ్ ఉన్నా ఖరీఫ్‌లో రైతులు విత్తనం కోసం ఇబ్బంది పడకుండా ఉన్నతస్థాయి అనుమతులతో పంపిణీ చేయనున్నారు.

వేరుశనగకే ప్రాధాన్యత : ఏటా మాదిరిగానే ఈసారి కూడా రాయితీ విత్తన ప్రణాళికలో వేరుశనగకే ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాకు 1.25 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరమని ప్రతిపాదించారు. అయితే పదేళ్లుగా పెద్ద ఎత్తున పంపిణీ చేస్తున్న కే-6 రకాన్ని తగ్గించి వాటి స్థానంలో కే-9, కదిరి-లేపాక్షి-1812, అలాగే టీసీజీఎస్-1694 (వశిష్ట) లాంటి మరి కొన్ని వేరుశనగ రకాలను అందుబాటులోకి తేవాలని గురువారం జరిగిన సమన్వయ సమావేశంలో అటు అధికారులు, ఇటు శాస్త్రవేత్తలు చర్చించారు. అలాగే 2,500 క్వింటాళ్ల కందులు, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు 600 క్వింటాళ్లు కేటాయించారు. అలసందలు 150 క్వింటాళ్లు, పెసలు 100 క్వింటాళ్లు, విత్తన కొర్ర 100 క్వింటాళ్లు, మరో 50 క్వింటాళ్ల రాగుల పంపిణీకి ప్రణాళిక తయారు చేశారు. కందుల్లో కూడా కేవలం ఎల్ఆర్‌జీ-41 రకం కాకుండా పీఆర్‌జీ-176 రకాన్ని ప్రోత్సహించాలని, అలాగే సూర్యనంది, గరుడ రకాల కొర్రలను అందుబాటులో ఉంచాలనే దానిపై చర్చించారు. ఇవి కాకుండా నాన్‌సబ్సిడీ కింద వరి, ఆముదం, మొక్కజొన్న, చిరుధాన్యాలు లాంటి మరికొన్ని రైతులకు అవసరమైన విత్తనాలు ఇవ్వడానికి కూడా ప్లాన్ చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

పింఛన్లు, బియ్యం పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అనంతపురం అర్బన్: ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా సామాజిక భద్రత పింఛన్లు, బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. పింఛన్లు, బియ్యం పంపిణీ, ఉపాధి పనులు, ఎంసీసీ, తాగునీటి సరఫరా, తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీలో ఎన్నికల కమిషన్ సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. పింఛన్ల పంపిణీకి నగదు తీసుకెళ్లే సమయంలో తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాలని ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. వలంటీర్లు పింఛనుదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛను డబ్బు అందించాలని చెప్పారు. ఈ క్రమంలో ఫొటోలు, వీడియోలు తీయకూడదని ఆదేశించారు. పంపిణీలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండకూదన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల వద్ద ఐడీ కార్డు, ఆథరైజేషన్ లెటర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పింఛన్ల పంపిణీ విషయంపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు, చెక్‌పోస్టులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు పూర్తి స్పష్టతో తెలియజేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకం పనుల కల్పనపై ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి కూలీలకు రోజుకు రూ.300 వేతనం వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తాగునీటి సమస్యకు సంబంధించి జిల్లా, పట్టణ, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కమ్మరి రామ్మూర్తిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సదానంద, సిద్దప్ప కుటుంబసభ్యులు దాడి చేశారు. గురువారం రాత్రి ఇంటికి వెళుతున్న తనపై బస్టాండు ప్రాంతంలో పొంచి ఉన్న సదానంద, సిద్దప్ప తదితరులు రాళ్లు రువ్వుతూ కట్టెలతో దాడి చేశారని బాధితుడు వివరించాడు. సమాచారం అందుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జయసింహ, రామచంద్ర తదితరులు శుక్రవారం ఉదయం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించారు.

కేశవ్ తనయుడికి నిరసన సెగ

వజ్రకరూరు/ ఉరవకొండ: వజ్రకరూరు మండలం పాత కడమలకుంటలో గురువారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విజయసింహకు గ్రామస్తుల నుంచి నిరసన సెగ ఎదురైంది. ఆర్టీటీ ఏరియాలో ఓటు అడగడానికి వచ్చినపుడు బోయ ఎర్రిస్వామి, బోయ లక్ష్మి, ఆదినారాయణ, అంజినమ్మ, కురుబ వెంకటలక్ష్మి, బోయ లక్ష్మీపతి, కురుబ గోపాల్ తదితరులు తాగునీరు, సీసీ రోడ్లపై విజయసింహను నిలదీశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మీ నాన్న కేశవ్ ఒక్కసారైనా గ్రామానికి వచ్చారా అని.. సమస్యలు ఏమున్నాయో అడిగారా అని ప్రశ్నించారు. వారికి సమాధానం చెప్పలేక విజయసింహ నీళ్లు నమిలారు.

బీటెక్ విద్యార్థి బలవన్మరణం

అనంతపురం సిటీ: ఒత్తిళ్లను తాళలేక బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం కదిరేపల్లికి చెందిన తంగెం కొండప్ప కుమారుడు సురేంద్ర (22)... శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాల్గో సంవత్సరం (ఈసీఈ) చదువుతున్నాడు. ఈ క్రమంలో ఎంఎస్‌ను విదేశాల్లో పూర్తి చేయాలని భావించాడు. ఈ క్రమంలో నిర్వహించిన పరీక్షల్లో ఆశించిన ర్యాంక్ రాకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. కన్నవారికి తన మొహం చూపించలేక ఏమో శుక్రవారం మధ్యాహ్నం జంగాలపల్లి – ప్రసన్నాయపల్లి మార్గంలో పట్టాలపైకి చేరుకుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం నుంచి తల వేరైంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఐరావతంపై కాటమరాయుడు


ఐరావతంపై నృసింహుడి దర్శనం

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఐరావతంపై (గజవాహనం) భక్తులకు ఖాద్రీ లక్ష్మీనారసింహుడు దర్శనమిచ్చాడు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఉత్సవ ఉభయదారులుగా పబ్బిశెట్టి రంగనాయకులు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. అంతకుముందు అర్చకులు పూజలు చేసి కలశాన్ని శ్రీవారి బ్రహ్మ రథంపై ప్రతిష్టించారు. ఐరావతంపై ఊరేగిన అనంతరం శ్రీవారు తిరిగి ఆలయంలోకి వెళ్లి పూజల అనంతరం రథంపైకి ప్రవేశించారు. శ్రీదేవి, భూదేవిలను కంకణ భట్టాచార్యులు రథంపైకి తీసుకొచ్చారు.

ప్రచార ప్రకటనలపై ఎంసీఎంసీ నిఘా

- పెయిడ్ న్యూస్‌పై నిరంతర పర్యవేక్షణ
- ప్రకటనలకు కమిటీ ధ్రువీకరణ తప్పనిసరి
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోపు సర్టిఫికేషన్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కంట్రోల్ రూమ్

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం కోసం పత్రికల్లో ఇచ్చే ప్రకటనలపై మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నిఘా పెడుతోంది. ఈ కమిటీ సభ్యులు రోజూ సమావేశమై ప్రసార మాధ్యమాల్లో వెలువడే ప్రకటనలను పరిశీలిస్తుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషియల్ మీడియాల్లో వెలువరించే ప్రతి పెయిడ్ న్యూస్‌ను పరిశీలిస్తుంది. అంతే కాక ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సర్టిఫికేషన్ (ధ్రువీకరణ) జారీ చేసే ప్రక్రియనూ ఈ కమిటీ నిర్వర్తిస్తుంది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోపు ఆయా ప్రటకనలకు సర్టిఫికేషన్ ఇస్తుంది.

పెయిడ్ న్యూస్‌ను పట్టేస్తుంది

ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులకు సంబంధించి వెలువరింటే కథనాల్లో పెయిడ్ న్యూస్‌ను కమిటీ సభ్యులు పసిగట్టేస్తున్నారు. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారానికి చేసే వ్యయాన్ని ఎన్నికల ఖర్చులో చూపాల్సి ఉంటుంది. అయితే కొందరు అభ్యర్థులు ఎన్నికల ఖర్చు తగ్గించి చూపేందుకు తమ అనుకూలంగా పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాల రూపంలో ప్రచారం వచ్చేలే చూసుకుంటారు. వీటిని పెయిడ్ న్యూస్ (ఆర్టికల్స్) అంటారు. అభ్యర్థులు ప్రసార మాధ్యమాల్లో ఇచ్చే ప్రతి అంశాన్ని కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, పెయిడ్ న్యూస్‌గా భావిస్తే దానిని కమిటీ చైర్మన్‌కు నివేదిస్తారు.

ఎంసీఎంసీ కమిటీ ఇదే

ఎంసీఎంసీకి జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. కమిటీ నోడల్ అధికారిగా ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ టి.భాస్కర్, కమిటీ మెంబర్ కన్వీనర్‌గా సమాచార శాఖ డీఐపీఆర్ఓ పి.గురుస్వామిశెట్టి ఉన్నారు. సభ్యులుగా ప్రింట్ మీడియా నుంచి డక్కన్ క్రానికల్ దినపత్రిక విలేకరి జి.నాగభూషణం, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి దూరదర్శన్ జిల్లా రిపోర్టర్ ఎం.మనోహర్, ఏఐఆర్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ నాగేశ్వరరెడ్డి వ్యవహరిస్తున్నారు.

వివాహితపై టీడీపీ నేత అత్యాచారయత్నం

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో వివాహితపై టీడీపీ నేత అత్యాచారయత్నం చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. అర్ధరాత్రి ఇంట్లో వివాహిత తప్ప ఇతరులెవరూ లేరనుకుని ఇంట్లోకి దూరిన ఆ గ్రామ టీడీపీ నాయకుడు అత్యాచారం చేయబోవడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో మేల్కొన్న అత్త ఎవరక్కడ అంటూ గద్దించడంతో ఆ నాయకుడు అక్కడి నుంచి ఉడాయించాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన టీడీపీ నేతలు దుప్పతి పంచాయితీకి సిద్ధమవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత బుధవారం ఆమె కుటుంబసభ్యులు వివిధ పనుల నిమిత్తం ఊరికెళ్లారు. ఆ సమయంలో ఆమెపై టీడీపీ నేత అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ అంశాన్ని అవమానంగా భావించిన సదరు వివాహిత ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెల్సింది. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా టీడీపీ నాయకులు మధ్యవర్తిత్వం నడిపారు. ఈ ఒక్కసారికి క్షమించి వదిలేయమని వేడుకున్నట్లు సమాచారం. ఇదే విషయంపై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా... తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఇద్దరి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన చౌక దుకాణపు డీలర్‌తో పాటు ఎండీయూ ఆపరేటర్‌ను కలెక్టర్ ఎం.గౌతమి ఆదివారం సస్పెండ్ చేశారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు గ్రామానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ టి.రుద్రయ్య, అనంతపురం అర్బన్ మండలం ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన డీలర్ జి.అంజనదేవి సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు

ఎంసీసీ ఉల్లంఘించిన కారణంగా విధుల నుంచి తొలగించిన ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం గ్రామ వలంటీరు వై.రాముడు, గోవిందవాడ గ్రామ వలంటీరు ఆర్.సుధాకర్, తాడిపత్రి మునిసిపాలిటీ వార్డు వలంటీరు బి.దాదాపీర్, శింగనమల మండలం వెస్ట్ నరసరాపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్, విడపనకల్లు గ్రామ ఎండీయూ ఆపరేటర్ రుద్రయ్య, ఉరవకొండ పట్టణానికి చెందిన బోయ శ్రీనివాసులు తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు అధికారికంగా జిల్లా యంత్రాంగం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఉత్సాహంగా ఎస్ఆర్ఐటీ వార్షికోత్సవం


సినీ యాక్టర్ షఫీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటీ) అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో 16వ వార్షికోత్సవం శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్‌పర్సన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కరెస్పాండెంట్, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ప్రముఖ నటుడు షఫీ హాజరయ్యారు. కళాశాలలో బ్రాంచ్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు యువతను ఉర్రూతలూగించాయి. విద్యార్థులతో కలసి సినీ యాక్టర్ షఫీ సందడి చేశారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



నరసంపల్లిలో మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

- రాప్తాడులో 30 వేల ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: చంద్రబాబు ఎన్ని పార్టీలతో జత కట్టినా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని సోమరవాండ్లపల్లి, నరసంపల్లి, బద్దలాపురం, యలకుంట్ల గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలుత ఆయా గ్రామాల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఉదయం 9 గంటలకు సోమరవాండ్లపల్లిలో ప్రారంభమైన ప్రచారం సాయంత్రం నాలుగు గంటలకు యలకుంట్లలో ముగిసింది. ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాప్తాడు నుంచి 30 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయమనిపిస్తోందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నరసంపల్లి, బద్దలాపురంలో జరిగిన ఎన్నికల బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందినట్లు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో రూ.3 వేల కోట్ల దాకా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. 20 వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని పేర్కొన్నారు. 17 వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. 10 వేల మంది మహిళా పాడి రైతుల కోసం అమ్మ డైయిరీ ఏర్పాటు చేశామన్నారు. పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి.. నియోజకవర్గంలోని 90 శాతం చెరువులను నింపినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేశామని తెలిపారు. సీఎం జగన్ సహకారంతో త్వరలోనే రామగిరి బంగారు గనులు తెరవబోతున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తాం

సార్వత్రిక ఎన్నికలు విజయ సాధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల్లో సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నాలుగు రిజర్వాయర్ల నిర్మాణానికి భూమిపూజ చేయించామన్నారు. ఇందుకోసం ఇప్పటికే భూ సేకరణ పనులు, నిధులు కూడా సమకూర్చుకున్నట్లు తెలిపారు. కనగానపల్లి మండల పరిధిలో నిర్మిస్తున్న సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు కూడా ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ సహకారంతో రిజర్వాయర్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. అనుకున్న విధంగా నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యను శాశ్వతంగా తీర్చేందుకు రూ.117 కోట్లు ఖర్చు చేసి పెన్నహోబిలం నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి 110 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. గోళ్లపల్లి రిజర్వాయర్ నుంచి కూడా మరో 48 గ్రామాలకు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు గంగుల భానుమతి, నాయకులు సుధీర్‌రెడ్డి, నరసింహాగౌడ్, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతిప్రసాద్, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాగముని, వెంకటరాముడు పాల్గొన్నారు.

సచివాలయాలతో ఇంటి వద్దకే పాలన

- ప్రజలకు అందుబాటులో 540 రకాల సేవలు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 22వ డివిజన్‌లో కొనసాగిన ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గతంలో ఏదైనా ప్రభుత్వ సేవలు పొందాలంటే తహసీల్దార్, మీసేవా, తదితర ఇతర కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి, ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 22వ డివిజన్‌లోని మరువకొమ్మ కాలనీ, వైఎస్సార్ కాలనీ, సంగమేష్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మొత్తం 85 సచివాలయాలు ఉండగా.. వందల సంఖ్యలో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. దాదాపుగా 540 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వన్ బీ అడంగల్, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ రకాల సేవలను అందిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇటువంటి సేవల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేసే పరిస్థితి ఉండేదన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడా మీరే తెలుసుకోవాలన్నారు.

రూ.2,304 కోట్ల సంక్షేమం.. రూ.1,045 కోట్లతో అభివృద్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో నియోజకవర్గంలో రూ.2,304 కోట్ల సంక్షేమం, రూ.1,045 కోట్లతో అభివృద్ధి పనులు జరిగినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమ్మఒడికి రూ.93.39 కోట్లు, విద్యా దీవెన-వసతి దీవెనకు రూ.73.59 కోట్లు, వైఎస్సార్ చేయూతకు రూ.89.98 కోట్లు, వైఎస్సార్ ఆసరాకు రూ.77.36 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుకకు రూ.403.98 కోట్లు, కాపు నేస్తం పథకానికి రూ.9.77 కోట్లు, ఈబీసీ నేస్తం పథకానికి రూ.11.78 కోట్లు, సున్నావడ్డీకి రూ.16.98 కోట్లు, వైఎస్సార్ బీమా రూ.6.06 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10.04 కోట్లు ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ కరెంటుకు రూ.5.27 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధికి సంబంధించి రూ.311 కోట్లతో అర్బన్ లింక్ రోడ్లు, రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు, ఎన్‌క్యాప్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.68.72 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.49.50 కోట్లు, రూ.19 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, రూ.41 కోట్లతో రుద్రంపేట పంచాయతీ, రూ.43 కోట్లతో ఏ నారాయణపురంలో, రూ.16 కోట్లతో రాజీవ్ కాలనీ, రూ.21 కోట్లతో అనంతపురం రూరల్‌లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే 22వ డివిజన్‌లో రూ.కోటిన్నరకు పైగా అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్టీసీ రీజినల్ బోర్డు చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రంగన్న, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కార్పొరేటర్లు లీలావతి, సాకే చంద్ర, సంపంగి రామాంజనేయులు, సాకే చంద్రలేఖ, బాలాంజినేయులు, కమల్‌భూషణ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, కృష్ణవేణి, డైరెక్టర్ శోభారాణి, స్థానికులు ఆదినారాయణ, చిన్నపీరా, రాజారెడ్డి, రామాంజనేయులు, ముస్తఫా, ఆనంద్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, రామయ్య, రాఘవ, హేమకిరణ్, జానీ, జావెద్, కేశవరెడ్డి, చెన్నారెడ్డి, నల్లప్ప, గుజ్జల లక్ష్మణ్, అమర్‌నాథ్ రెడ్డి, పార్వతి, భారతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా వ్యాసరాజుల ఆరాధన



అలంకరణలో వ్యాసరాజ బృందావనం

అనంతపురం కల్చరల్: దేశవ్యాప్తంగా హైందవ ధర్మప్రచార పరిరక్షణ కోసం జన చైతన్యం తెచ్చిన మహనీయుడు వ్యాసరాజ స్వామి 485వ ఆరాధనోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక పాతూరులోని వ్యాసరాజమఠంలో వివిధ దేవతామూర్తులు కొలువైన బృందావనాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆరాధనోత్సవం నిర్వహించారు. ఉదయం నిర్మాల్య విసర్జన, అష్టోత్తర పారాయణం, పంచామృతాభిషేకం అనంతరం పండితులు ప్రవచనంలో వ్యాసరాజుల విశిష్టతను తెలియజేశారు. సాయంత్రం ఆలయ ట్రస్టీ హరినారాయణ, మఠం అధికారి శ్రీకాంత్, రఘునాథ్ స్వామి ఆధ్వర్యంలో భజన, స్వస్తివచనం, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

యువత శ్రమదానం



రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న యువకులు

చెన్నేకొత్తపల్లి: నాగసముద్రం పంచాయతీ సర్పంచ్ సుధారాణి భర్త ఓబులేసుతో పాటు మరో ముగ్గురు యువకులు శ్రమదానం చేసి ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం ఎన్ఎస్ గేట్ నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో నాగసముద్రం బస్టాండ్ వద్ద ఏర్పడిన గుంతలను సిమెంట్‌తో పూడ్చివేశారు. రహదారికి మరమ్మతులు చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు నాగరాజు, నాగేంద్ర, తలారి పోతలయ్యను వాహనదారులు అభినందించారు.

వేంకట రమణుడికి విశేష పూజలు



అలంకరణలో వెంకన్న, శ్రీదేవి, భూదేవి

యల్లనూరు: మండల కేంద్రంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం భక్తులు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాత్రికి శేష వాహనంపై స్వామి ఊరేగింపు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకుకూ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, శ్రీనివాసాచార్యులు, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

మోసపూరిత హామీలు నమ్మొద్దు



సింగంపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: అధికారం కోసం చంద్రబాబు నెరవేరని మోసపూరిత హామీలు ఇస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రభుత్వ పథకాలన్నీ రద్దు చేస్తారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని సింగంపల్లి, సింగంపల్లి తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. ప్రజలు అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నారని.. మోసపూరిత హామీలను నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. ఫ్యాన్ గుర్తుకు ఓటే వేసి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, వెంకటేష్, లక్ష్మీనారాయణరెడ్డి, ఎర్రిస్వామి, ఓబులేష్, నాయకులు వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, హనుమంతు నాయక్, ఆదెప్ప, వెంకటేష్, శ్రీనివాసులు, వెంకట్రాముడు, అల్లీపీరీ, ఈశ్వరరెడ్డి, వెంకటేష్‌చౌదరి, రఘునాథ్‌రెడ్డి, మహేష్, శంకర్‌నారాయణ రెడ్డి (చిన్నా), ఈశ్వరరెడ్డి, నాగరాజు, చంద్ర, నరసింహులు, పోతన్న, ముత్యాలన్న, నరేష్ రెడ్డి, కబాబ్ ఎర్రిస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

సీమ సాంస్కృతిక రంగంలో కొత్తమలుపు



మాట్లాడుతున్న తరిమెల అమరనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: రాయలసీమ ప్రాంత జీవన స్థితిగతులు సంస్కృతిని కేవలం సాహిత్యంలోనే కాకుండా రంగురంగుల చిత్రాలలో వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా చిత్రీకరించడం సీమ సాంస్కృతిక రంగంలో మరో కొత్త మలుపు అని సీనియర్ రచయిత, మానవతా కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంస్థ కార్యాలయంలో రాయలసీమ చిత్రలేఖ ప్రదర్శన జరిగింది. తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకార్థం జరిగిన కార్యక్రమానికి వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు మాజీ వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తరిమెల అమరనాథరెడ్డి, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, షేక్ నబీరసూల్ తదితరులు మాట్లాడారు. విభిన్న సంప్రదాయాలు, భిన్నత్వంలో ఏకత్వంతో సీమ సమాజం ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం చిత్రప్రదర్శనను అనేక మంది తిలకించారు. కార్యక్రమంలో కవులు గోసల నారాయణ స్వామి, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, మధురశ్రీ, కృష్ణవేణి, టీవీరెడ్డి, ఈరన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి



ఎం.బండమీదపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

రాప్తాడు: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది కోరారు. శుక్రవారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవితో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలను వివరించారు. గిమ్మిక్కు రాజకీయాలు, కుయుక్తులకు నిలువుటద్దమైన పరిటాల సునీత మాటలకు మోసపోవద్దని సూచించారు. సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి గెలిస్తేనే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. టీడీపీ నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తే ఏ ముఖం పెట్టుకుని గ్రామాల్లోకి వస్తున్నారో ప్రశ్నించాలన్నారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని తేల్చి చెప్పి టీడీపీ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



కరణం హరికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాలు 1వ తేదీనే చెల్లించేలా చట్టబద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక కో-చైర్మన్, పోర్టో చైర్మన్, ఎస్టీపీ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఐక్య వేదిక కో-చైర్మన్‌గా ఎన్నికైన హరికృష్ణకు పోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) అనంతపురం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సమావేశంలో ఐక్యవేదిక కో-చైర్మన్ కరణం హరికృష్ణ మాట్లాడుతూ.. పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జేఎల్, డైట్ , ఎస్సీఈఆర్‌టీ, ఐఏఎస్ఈ లెక్చరర్లు, ప్రిన్సిపాల్, డీవైఈఓ, డీఈఓ, ఆర్జేడీలుగా ఉపాధ్యాయులను మాత్రమే పదోన్నతుల ద్వారా నియమించాలని కోరారు. అనంతరం హరికృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో పోర్టో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకట నారాయణ రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, డీటీడబ్ల్యూటీ ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న, పిడుగు శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, శోభామణి, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, ఎస్టీపీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలిరండి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు మండలం నుంచి పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మండల కన్వీనర్ నర్సిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బస్సుయాత్ర శనివారం రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. మండలంలోని పలు గ్రామాలకు సుమారు 50 వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయండి



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యర్థించారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలందరూ అభివృద్ధి చెందారన్నారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శేషప్ప, ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బండి పవన్, నాయకులు ఈశ్వరయ్య, శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, శంకర్ గౌడ్, నాగేంద్రరెడ్డి, పురుషోత్తమ నాయుడు, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

గుత్తి: క్రీడల్లో గెలుపోటములను సమానంగా భావించేవారే అసలైన విజేతలని పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజ్‌కుమార్, బలిజ సంఘం మహిళా అధ్యక్షురాలు కందుల హేమలత, ఎస్ఐ నబీ రసూల్ అన్నారు. గుత్తిలోని కాల్వగడ్డ ఆంజనేయస్వామి క్రీడామైదానంలో శుక్రవారం యునైటెడ్ చాంపియన్స్ స్టేట్ లెవెల్ క్రికెట్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. ఆర్గనైజర్ మాట్లాడుతూ టోర్నీలో మొత్తం 17 జట్లు పాల్గొంటాయన్నారు. విన్నర్స్‌కు రూ. 50 వేలు, రన్నర్స్‌కు రూ. 30 వేలు, మెడల్స్, కప్స్ అందజేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ఆత్మకూరు: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం





అనంతపురం సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న సీహెచ్ జోషి ఆనంద్ ప్రకాష్, సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

ఆత్మకూరు/రాప్తాడు/కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. ఆత్మకూరు మండలంలోని పి.యాలేరు గ్రామంలో యేసుప్రభు నామస్మరణ చేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. రాప్తాడులోని కరుణామయుడు చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సర్వజనుల కోసం ఏసుక్రీస్తు శిలువ మరణం పొందిన రోజునే గుడ్ ఫ్రైడే జరుపుకుంటామని విచారణ గురువులు బాలరాజు, ఫాదర్ రవీంద్ర ప్రసాద్ తెలిపారు. కరుణ, ప్రేమ మార్గాల ద్వారా ఎంతటి కష్టాలనైనా జయించవచ్చన్నారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని ధన్యులు కావాలన్నారు. అనంతరం చర్చిలో అందరూ కలసి ప్రార్థనలు చేశారు. కనగానపల్లి మండలంలోని సీఎన్ కోట, తగరకుంట, మామిళ్లపల్లి, వేపకుంట గ్రామాల్లోని చర్చీల్లో సందడి నెలకొంది.



సప్తగిరి చర్చిలో పాటలు పాడుతున్న దృశ్యం



కనగానపల్లి: సీఎన్ కోట చర్చి వద్ద ప్రార్థనలు



రాప్తాడు: చిన్మయనగర్‌లో శిలువ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి బిజినెస్
శనివారం
30-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
655	203
73,651	22,327

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,379	▽ 20
డోజోన్స్	39,807	▲ 47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲ 21
డాక్స్	18,492	▲ 15
షాంఘై	3,041	▲ 30
నికాయ్	40,369	▲ 201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	93.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.23	106.78
€	యూరో	ఎస్‌బీఐ	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.64	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49



దేశంలో ఆధ్యాత్మిక టూరిజం జోష్

రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి • లిస్టులో తిరుపతి, అయోధ్య, వారణాసి

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక పర్యాటకంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో బడా రిటైల్ బ్రాండ్లు ఆధ్యాత్మిక కేంద్రాలపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందించే దిశగా తిరుపతి, అయోధ్య, వారణాసి, అమృత్‌సర్, పూరి, అజ్మీర్ వంటి నగరాల్లో గణనీయంగా విస్తరిస్తున్నాయి. 14 కీలక నగరాల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక టూరిజంతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రిటైల్ చెయిన్స్ అనుసరిస్తున్న వ్యూహాలపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మదురై, గురువాయూర్, ద్వారకా, మథురా తదితర నగరాల్లో కూడా రిటైల్ బూమ్ కనిపిస్తున్నట్లు రిపోర్టు పేర్కొంది. పేరొందిన మాల్స్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా టూరిస్టులను ఆకర్షించేలా తమ బ్రాండ్లను ప్రదర్శించడంపై రిటైల్ సంస్థలు దృష్టి పెడుతున్నాయి. అయోధ్యలో మాన్యవర్, రిలయన్స్ ట్రెండ్స్, రేమండ్స్, మార్కెట్99, ప్యాంటలూన్స్, డామినోస్, పిజ్జా హట్, రిలయన్స్ స్మార్ట్ మొదలైనవి తమ రిటైల్ స్టోర్స్ ప్రారంభించినట్లు నివేదిక వివరించింది. వారణాసిలో జుడియో, షాపర్స్ స్టాప్, బర్గర్ కింగ్ తదితర సంస్థలు కూడా కార్యకలాపాలు విస్తరించినట్లు పేర్కొంది. టూరిజంను ప్రోత్సహించేందుకు, కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం లభిస్తున్నట్లు సీబీఆర్‌ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ఫ్యాషన్, ఫుడ్ అండ్ బెవరేజెస్, హైపర్‌మార్కెట్లు మొదలైన సంస్థలన్నీ కూడా భక్తుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను అందిస్తూ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వివరించారు. ఆధ్యాత్మిక టూరిజం ట్రెండ్‌తో ఆయా ప్రాంతాల్లో ఆతిథ్య, రిటైల్ రంగాలకు కలిసి వస్తోందని సీబీఆర్‌ఈ ఇండియా ఎండీ రామ్ చంద్నానీ తెలిపారు.

ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ ఇటువైపు చూస్తున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో ఏకంగా రూ. 2 లక్షల కోట్ల పైగా ఇన్వెస్ట్ చేశారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. 2020–21లో ఏకంగా రూ. 2.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు ఆ మరుసటి సంవత్సరం రూ. 1.4 లక్షల కోట్లు, ఆ తర్వాత 2022–23లో రూ. 37,632 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2023–24లో భారీగా ఇన్వెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సానుకూలంగా కొత్త ఏడాది..

కొత్త ఆర్థిక సంవత్సరంపై కూడా అంచనాలు కాస్త సానుకూలంగానే ఉన్నాయని భారత్‌లో మజార్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ తెలిపారు. పురోగామి పాలసీ సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాల కారణంగా దేశంలోని ఎఫ్‌పీఐల ప్రవాహం స్థిరంగా కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాల కారణంగా మధ్యమధ్యలో ఒడిదుడుకులు ఉండవచ్చన్నారు.

చిన్న షేర్ల పెద్ద ర్యాలీ

60 శాతానికి మించి రాబడులు • 2023–24లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా

న్యూఢిల్లీ: దలాల్ స్ట్రీట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023 –24)లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా కొనసాగింది. దేశంలో దృఢమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు అధిక ఆసక్తి చూపారు. 2023–24లో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 62%, స్మాల్ క్యాప్ సూచీ 60% రాణించాయి. ఇదే కాలంలో బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 25% పెరిగింది.

''ఆదాయాలు గణనీయంగా పెరగడం, అధిక వృద్ధి అవకాశాలతో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్లను కొనుగోలుకు ఆసక్తి చూపారు. లార్జ్ క్యాప్ షేర్ల పట్ల విముఖత చూపారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నికర పెట్టుబడులు పెరగడం ఇందుకు నిదర్శనం. ఆర్థిక విస్తరణ సమయంలో చిన్న, మధ్య తరహా షేర్ల వృద్ధి వేగంగా ఉంటుందనే సంప్రదాయ సూత్రాన్ని వారు విశ్వసించారు. అంతేకాకుండా స్మాల్, మిడ్ సైజ్ కంపెనీల అద్భుతమైన త్రైమాసిక ఫలితాలు వారిని కొనుగోళ్ల వైపు ఆకర్షితం చేశాయి'' అని హెడ్జ్ ఫండ్ హెడొనోవా సీఐఓ సుమన్ బెనర్జీ తెలిపారు.



- 2023–24లో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫిబ్రవరి 8న 40,282 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. గతేడాది మార్చి 31న 23,881 వద్ద ఏడాది కనిష్టానికి తాకింది.
- ఇదే కాలంలో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ ఫిబ్రవరి 7న 46,821 వద్ద ఆల్‌టైం హైని నమోదు చేయగా, గతేడాది మార్చి 31న 26,692 వద్ద 52 వారాల కనిష్టాన్ని తాకింది.
- సెన్సెక్స్‌తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి షేర్ల అత్యుత్తమ ప్రదర్శన భారత ఈక్విటీ మార్కెట్ క్రియాశీలక స్వభావాన్ని, ఇన్వెస్టర్ల అపార వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతి తెలిపారు.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ చిన్న, మధ్య తరహా షేర్ల ర్యాలీ కొనసాగుతుందని న్యాతీ అభిప్రాయపడ్డారు. ''సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వమే తిరిగి అధికారాన్ని దక్కించుకోవచ్చనే అంచనాలతో వ్యాపార అనుకూల వాతావరణం పెంపొంది స్థిరమైన వృద్ధి కొనసాగొచ్చు. దీనికి తోడు భారత వృద్ధి బలమైన అవుట్‌లుక్ అంచనాలు ఈ రంగాల షేర్లకు డిమాండ్‌ను పెంచుతాయి'' న్యాతీ తెలిపారు. అయితే కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు, అంతర్జాతీయ అనిశ్చితులు, లాభాల స్వీకరణ వంటి అంశాలు స్వల్పకాలిక ఒడిదుడుకులకు దారితీయొచ్చన్నారు.

ఐపీవో బాటలో ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా

ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈ షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఐపీవోతో రూ. 7,000 కోట్లు సమకూర్చుకోనుంది.

రూ. వెయ్యి కోట్లకు జిరోధా ఫండ్ విలువ

జిరోధా, స్మాల్‌కేస్ జేవీ జిరోధా ఫండ్ హౌస్ నిర్వహణలోని ఆస్తుల విలువ కేవలం 40 రోజుల్లో రూ. 500 కోట్ల మేర ఎగసింది. దీంతో సంస్థ ఏయూఎం రూ. 1,000 కోట్ల మార్కును దాటింది.

300 నగరాల్లో కియా కేంద్రాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కియా ఇండియా విక్రయ, సర్వీస్ కేంద్రాలను విస్తరిస్తోంది. కియా 2.0 వ్యూహంలో భాగంగా డిసెంబర్‌కల్లా 300 నగరాలు, పట్టణాల్లో అడుగు పెట్టడం ద్వారా టచ్ పాయింట్స్ సంఖ్యను 700లకు చేరుస్తామని ప్రకటించింది. ప్రస్తుతం 236 నగరాలు, పట్టణాల్లో కంపెనీకి 522 సేల్స్, సర్వీస్ సెంటర్స్ ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-3-2024 ఫామ్ ధర...	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో వాటా విక్రయం

బ్యాంక్ నుంచి వార్‌బర్గ్ పింకస్ ఔట్

న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుంచి పూర్తిగా వైదొలగింది. తాజాగా బ్యాంకులోగల మొత్తం 2.25 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 75.24 సగటు ధరలో 15.88 కోట్ల బ్యాంకు షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,195 కోట్లుకాగా.. క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా 2023 డిసెంబర్‌కల్లా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 2.25 శాతం వాటాను కలిగి ఉంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 4.2% వాటాను వార్‌బర్గ్ పింకస్ రూ. 2,480 కోట్లకు విక్రయించిన విషయం విదితమే. కాగా.. గురువారం బీఎస్‌ఈలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు 3.1% క్షీణించి రూ. 75.4 వద్ద ముగిసింది.

హైరింగ్ ప్రణాళికల్లో స్టోరబుల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెల్ఫ్–స్టోరేజ్ టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికన్ సంస్థ స్టోరబుల్ భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో 15వేల చ.అ. విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. గతేడాదే హైదరాబాద్‌లో తమ ఏషియా జీసీసీని స్టోరబుల్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ 60 మంది ఉద్యోగులు ఉండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 120కి పెంచుకోనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు. ఇంజనీరింగ్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు.

సినిమా

డిసెంబరులో ఆరంభం



• ప్రభాస్

ఈ ఏడాది డిసెంబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారని తెలిసింది. హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సిన్సియర్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది డిసెంబరులో ఆరంభించేలా ప్లాన్ రెడీ చేస్తున్నారట సందీప్ రెడ్డి వంగా. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రష్మికా మందన్నా, కీర్తీ సురేష్, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించనున్నారు. భూషణ్ కుమార్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

టీజర్ రెడీ

'పుష్ప : ది రూల్' సినిమా టీజర్‌కు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. హీరో అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న 'పుష్ప: ది రూల్' సినిమా టీజర్‌ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. 'పుష్ప: ది రూల్' సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఇక 'పుష్ప' సినిమా ఫ్రాంచైజీలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సినిమా సక్సెస్ కావడంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దర్శకుడు త్రివిక్రమ్, మరో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాలతో అల్లు అర్జున్ సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల అప్‌డేట్స్ కూడా అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న వచ్చే అవకాశం ఉంది. ఇంకా అల్లు అర్జున్–దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లోని కొత్త సినిమా ప్రకటన కూడా రావొచ్చనే ప్రచారం జరుగుతోంది.



• అల్లు అర్జున్

ఆలియాకు విలన్‌గా...?



• బాబీ డియోల్

ఆలియా భట్, షార్వరి లీడ్ రోల్స్‌లో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్‌గా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందట. శివ్ రావైల్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. గతంలో 'రాజీ' సినిమాలో స్పై పాత్రలో నటించిన ఆలియా భట్ మళ్లీ ఈ సినిమాలో ఆ తరహా పాత్రను ఓకే చేయడం విశేషం. ఇక 'యానిమల్'లో విలన్ రోల్‌లో బాబీ డియోల్ విజృంభించిన విషయం తెలిసిందే. మరి.. యశ్ రాజ్ ఫిలింస్ తాజా చిత్రంలో విలన్‌గా సై అంటే... మరోసారి బాబీ నెగటివ్ పెర్ఫార్మెన్స్‌ని చూసే వీలు దక్కుతుంది.

ఇటు మెకానిక్ రాకీ.. అటు లైలా!



• మెకానిక్ రాకీలో విశ్వక్ సేన్

బర్త్ డే (మార్చి 29) రోజున హీరో విశ్వక్ సేన్ డబుల్ ధమాకా అందుకున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న రెండు కొత్త సినిమాల వివరాలను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. విశ్వక్ టైటిల్ రోల్‌లో నటించనున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నరేశ్, 'వైవా' హర్ష, హర్షవర్ధన్ కీలక పాత్రల్లో నటిస్తారు. రవితేజ ముళ్లపూడిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ లుక్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ స్వరకర్త. అలాగే విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న మరో సినిమా 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. ఈ సినిమాలో సెకండాఫ్‌లో లైలా అనే అమ్మాయిగా విశ్వక్ కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాకు తనిష్క్ బాగ్చి మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాలే కాకుండా విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే సినిమా చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 17న విడుదల కానుంది.

వేసవిలో వస్తున్నా డియర్



• జీవీ ప్రకాశ్, ఐశ్వర్య

ఒక కుటుంబంలో ఓ సమస్య వస్తుంది? ఆ సమస్యను ఆ కుటుంబం ఎలా పరిష్కరించింది? వివాహ బంధం సుదీర్ఘంగా సాగడానికి ఏం అవసరం? వంటి అంశాలతో రూపొందిన చిత్రం 'డియర్'. జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా ఒక్క రోజు గ్యాప్‌లో విడుదల కానుంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానున్నాయి. తెలుగు వెర్షన్ ఆంధ్ర హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణ రైట్స్ ఏషియన్ సినిమాస్ దక్కించుకున్నాయి. ''చక్కని కామెడీ ఫ్యామిలీ డ్రామాగా 'డియర్'ని వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. తమిళంలో పాటలు పాపులర్ అయ్యాయి. త్వరలోనే తెలుగు పాటలను విడుదల చేయనున్నాం'' అని తెలుగు హక్కులు సొంతం చేసుకున్న సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.



• బనితా సంధు

స్పైతో బనితా ఎంట్రీ

'అక్టోబర్, సర్దార్ ఉదమ్' వంటి హిందీ చిత్రాలతో, తమిళ చిత్రం 'ఆదిత్య వర్మ'తో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు బనితా సంధు. ఈ బ్యూటీ 'జీ 2' (గూఢచారి 2) చిత్రంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు పరిచయం కానున్నారు. అడివి శేష్ హీరోగా రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ (2018) 'గూఢచారి'కి సీక్వెల్‌గా పాన్ ఇండియా స్థాయిలో 'జీ 2' తెరకెక్కుతోంది. గూఢచారిగా హీరో అడివి శేష్ నటిస్తున్నారు. ఈ స్పై సరసన బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బనితా జాయిన్ అయిన విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ''శేష్, బనితాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. తెరపై ఇద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. హై ఆక్టేన్ యాక్షన్ మూవీగా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ''ఈ చిత్రంలో నటించడం క్రియేటివ్‌గా నాకు చాలా హ్యాపీగా ఉంది. ఇప్పటివరకూ చేయని పాత్రను ఈ చిత్రంలో చేస్తున్నాను'' అని బనితా సంధు అన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర చేస్తున్నారు.

అందరూ కనెక్ట్ అవుతారు



• రుహానీ శర్మ

సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారని శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ పేర్కొంది.


కథ రెడీ అవుతోంది!



టామ్ క్రూజ్

హాలీవుడ్ ఫిల్మ్ 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం 'టాప్‌గన్ 3' సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి రెండు భాగాలు 'టాప్‌గన్', 'టాప్‌గన్: మావెరిక్' లో హీరోగా నటించిన టామ్ క్రూజ్‌యే 'టాప్ గన్ 3'లోనూ హీరోగా నటించనున్నారని తెలుస్తోంది. ''టాప్‌గన్ 3' బేసిక్ కథ సిద్ధంగా ఉంది. టామ్ క్రూజ్‌కు స్టోరీలైన్ చెప్పాం. ఆయన నచ్చిందని చెప్పారు. కథకు మెరుగులు దిద్దే పనిలో ఉన్నాం'' అని 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నిర్మాతల్లో ఒకరైన జెర్రీ బ్రూమ్ హైమర్ పేర్కొన్నారు.

ఆస్కార్ విజేత లూయిస్ గోసెట్ కన్నుమూత



హాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. అమెరికన్ ప్రముఖ నటుడు, ఆస్కార్ అవార్డు విజేత లూయిస్ గోసెట్ జూనియర్ (87) కాలిఫోర్నియాలో కన్నుమూశారు. లూయిస్ మరణాన్ని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించినట్లుగా హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ఇక 1936లో లూయిస్ గోసెట్ సీనియర్, హెలెన్ రెబక్కా దంపతులకు మే 27న న్యూయార్క్‌లో జన్మించారు లూయిస్ గోసెట్ జూనియర్. చిన్నతనంలోనే లూయిస్‌కు నటన పట్ల ఆసక్తి ఉండేది. అలా 17ఏళ్ల వయసులోనే రంగస్థల నటుడిగా మారాడు లూయిస్. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. 'ఎ రైసిన్ ఇన్ ది సన్, ది బ్లాక్స్, ది పనిషర్, స్కిన్‌గేమ్' వంటి సినిమాల్లో నటించారు. 'ది బుక్ ఆఫ్ నీగ్రోస్' వంటి టెలివిజన్ సిరీస్‌లలో కూడా నటించారు లూయిస్. ఇక 1982లో వచ్చిన 'యాన్ ఆఫీసర్ అండ్ ఏ జెంటిల్‌మేన్' సినిమాలోని నటనకుగాను 55వ ఆస్కార్ అవార్డ్స్‌లో లూయిస్ ఉత్తమ సహాయనటుడు విభాగంలో అవార్డు అందుకున్నారు. కాగా ఈ విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి నటుడు లూయిస్‌నే అని హాలీవుడ్ సమాచారం. అలాగే ఇదే సినిమాకు ఉత్తమ సహాయ నటుడు విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా దక్కించుకున్నారు. 1977లో వచ్చిన మినీ సిరీస్ 'రూట్స్'లోని నటన లూయిస్‌కి మంచి పేరు తెచ్చిపెట్టడంతో పాటు ఎమ్మీ అవార్డు కూడా అందుకునేలా చేసింది.